చెరువు కట్టపై చెత్త

కామారెడ్డి పెద్ద చెరువుకు వెళ్లే కట్టపై ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు

చెరువు కట్టపై పెరిగిన పిచ్చి మొక్కలు

పిచ్చి మొక్కలు పెరగడంతో కనబడకుండా పోయిన స్టీల్ రాడ్లు

చెరువు కట్టపై పేరుకుపోయిన చెత్త

- అపరిశుభ్రంగా కామారెడ్డి పెద్ద చెరువు
- మినీ ట్యాంక్ బండ్‌పై అధికారుల నిర్లక్ష్యం

కామారెడ్డి, మార్చి 9: కామారెడ్డి పెద్ద చెరువు అపరిశుభ్రతకు నిలయంగా మారింది. పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చేందుకు అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. చెరువు కట్టపై స్టీల్ రాడ్లను ఏర్పాటుచేశారు. కట్టను చదును చేసి వాకింగ్ చేయడానికి అనువుగా మార్చారు. కట్టపై ఆహ్లాదకర వాతావారణాన్ని ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం దానిని పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో కట్టపై చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగాయి. అటువైపు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బల్దియా సిబ్బంది పారిశుద్ధ్యంపై పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరోవైపు కామారెడ్డి పట్టణాన్ని శుభ్రగా ఉంచాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

మందుబాబులకు అడ్డాగా..

మరోవైపు చెరువు కట్ట మందుబాబులకు అడ్డాగా మారింది. పట్టణానికి దూరంగా ఉండడంతో పలువురు మద్యం ప్రియులు చెరువు కట్టపైకి వెళ్లి మందు సేవిస్తున్నారు. అక్కడే చిందులు వేస్తూ.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పలువురు పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచే మద్యం సేవించే వారు అక్కడికి చేరుకుంటున్నారని అంటున్నారు. దీంతో మహిళలు అటువైపు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంతో మందు బాబులకు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. తాగిన మద్యం బాటిళ్లను పగులగొడుతున్నారు. చెరువు సమీపంలో పొలం ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాళ్లకు గుచ్చుకొని గాయాలవుతున్నాయని వాపోతున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చెరువు కట్టను శుభ్రం చేయాలని, మందుబాబులు అక్కడికి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. శానిటేషన్ డిపార్ట్‌మెంట్ వారికి తెలిపి, చెరువు కట్టపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగింపజేస్తామన్నారు. అక్కడ చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెరువు కట్ట ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన విషయని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

కామారెడ్డి, మార్చి 9: అవార్డీ టీచర్స్ అసోసియేషన్(ఆట) ఆధ్వర్యంలో జిల్లాలోని పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ఆదివారం సన్మానించారు. పట్టణంలోని సాందీపని డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2024 సంవత్సరంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన పలువురికి అవార్డులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వేదపండితుడు గంగవరపు ఆంజనేయ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజాన్ని మంచి దారిలో నడిపే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం అవార్డీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పది ప్రాథమిక పాఠశాలలకు 20 చొప్పున మొత్తం 200 కుర్చీలను అందజేశారు. ఆట గేయాన్ని, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆట జిల్లా అధ్యక్షుడు మనోహర్, ప్రధాన కార్యదర్శి బాల్‌రెడ్డి, కోశాధికారి హరిప్రసాద్, సహాధ్యక్షుడు విష్ణువర్ధన్, వ్యాఖ్యాతలు అంబీర్ మనోహర్ రావు, విజయకుమారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సేనాధిపతి, గంగాకిషన్, జిల్లా ఆట కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మాల సంఘం బాన్సువాడ డివిజన్ కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

బాన్సువాడ, మార్చి 9: మాల సంఘం బాన్సువాడ డివిజన్ కార్యవర్గాన్ని ఆదివారం బాన్సువాడలోని ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ మాల సంఘం వ్యవస్థాపకుడు అయ్యాల సంతోష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సంఘం డివిజన్ అధ్యక్షుడిగా మిర్జాపూర్ సాయన్న, ప్రధాన కార్యదర్శిగా పోతురాజు రాజు, ఉపాధ్యక్షులుగా దడేకర్ సురేశ్, గైని శంకర్, కోశాధికారిగా దండు భూమేశ్, సంయుక్త కార్యదర్శులుగా పుప్పాల సైదయ్య, కాలే సాయిలు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సాయన్న మాట్లాడుతూ సంఘ సభ్యులకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎంపిక చేసిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పోచయ్య, గైని శ్రీనివాస్, తిమ్మల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఆత్మీయ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న ఎస్సెస్సీ 1978-79 బ్యాచ్ విద్యార్థులు

భిక్కనూరు, మార్చి 9: కామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. పాఠశాలలో 1978- 79లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని భిక్కనూరు మండలంలోని బేసిక్ సమీపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తాము చేస్తున్న వృత్తితోపాటు కుటుంబ వివరాలు తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. సమ్మేళనంలో తెలంగాణ పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ ఇంజినీర్ ఇన్ చీఫ్ (రిటైర్డ్) శ్రీధర్, రిటైర్డ్ హెచ్ఎం భూమయ్య, భారత్ డైన మిక్స్ లిమిటెడ్ రిటైర్డ్ మేనేజర్ సునీల్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు చాట్ల రాజేశ్వర్, పాత బాల్ కిషన్, ట్రాన్స్‌కో రిటైర్డ్ ఈఈ రామలింగం, ప్రముఖ వ్యాపారులు మధుసూదన్, వెంకట రమణ, కస్వ వెంకటేశం, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ రమేశ్, జర్నలిస్ట్ ఇంద్రసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట, దేవునిపల్లి పీఎస్ పరిధిలో కవాతు చేస్తున్న పోలీసులు

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

రాజంపేట్/ కామారెడ్డి రూరల్, మార్చి 9: రాజంపేట మండల కేంద్రంలో ఎస్సై పుష్పరాజ్ ఆధ్వర్యంలో శాంతి భద్రతలే లక్ష్యంగా పోలీసులు ఆదివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన వీధుల గుండా సాయుధ బలగాలతో కవాతు చేపట్టారు. ప్రజలకు పోలీసులు నిత్యం అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలను కాపాడుతామని భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు, ఆర్ఎస్సై సాయి, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవునిపల్లి పీఎస్ పరిధిలో నిర్వహించిన కవాతులో కామారెడ్డి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామన్, ఎస్సై రాజు, ఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ టీపీ భగేల్, ఆర్‌పీఎఫ్ బలగాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాకతీయనగర్, గాయత్రీనగర్, దేవునిపల్లి, సరంపల్లి తదితర ప్రాంతాల్లో మార్చ్‌ఫాస్ట్ కొనసాగింది. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని పోలీసులు కోరారు. అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో
లక్ష్యానికి మించి కేసుల పరిష్కారం

కామారెడ్డి, మార్చి 9: జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 2,274 కేసులు పరిష్కరించబడ్డాయని ఎస్సీ సింధూశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ ఇన్వెస్టిగేషన్, కోర్టు విచారణలో ఉన్న ఐపీసీ కేసులు 257, డ్రంక్ అండ్ డ్రైవ్, ఎంవీ యాక్ట్, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన కేసులు 1,797, ఈ పెట్టి, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన తదితర పెట్టి కేసులు 220 కలిపి మొత్తం 2,274 కేసులు పరిష్కరించబడ్డాయని పేర్కొన్నారు. పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది 15 రోజుల నుంచి కేసుల్లో ఉన్న కక్షిదారులను కలిసి రాజీ మార్గం రాజ మార్గమని, లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించినట్లు తెలిపారు. దీంతో లక్ష్యానికి మించి కేసులు పరిష్కరించబడ్డాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

బాణాపూర్ గ్రామంలో పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

లింగంపేట్, మార్చి 9: అధికారంతో సంబంధం లేదని, అధికారంలో ఉన్నా, లేకున్నా, ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మండలంలోని బాణాపూర్ గ్రామంలో ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆదివారం బాధిత కుటుంబానికి పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త ఆళ్ల బాలయ్య ప్రమాదవశాత్తు మరణించగా పార్టీ ఇన్సూరెన్స్ కింద రూ.రెండు లక్షల విలువైన చెక్కును బాధిత కుటుంబసభ్యులకు అందజేసి మాట్లాడారు. ఆయనవెంట మండల పార్టీ అధ్యక్షుడు దివిటి రమేశ్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, స్థానిక నాయకులు ఉన్నారు.

బీడీ కాలనీలో మరో బోరు వేయించండి సారూ..

- లోకల్ బోరు నీళ్లు అసలే రావడం లేదు
- మిషన్ భగీరథ నీళ్లు కొన్నే వస్తున్నాయ్
- ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

ఎల్లారెడ్డి బీడీ కాలనీలో మిషన్ భగీరథ నీళ్లు చాలినన్ని రావడం లేదని చూపిస్తున్న మహిళ

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 9: కాలనీలో ఒక్క బోరు సరిపోవడం లేదని, మరొక్క బోరు వేయించి తమను అదుకోవాలని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన మహిళలు మాట్లాడారు. ఎల్లారెడ్డి శివారులో ఉన్న బీడీ కాలనీలో సుమారు వంద వరకు ఇండ్లు ఉన్నాయని, మొత్తం కాలనీకి అంతా కలిపి ఒకే ఒక్క బోరు ఉన్నదన్నారు. చలికాలం, వర్షాకాలంలో నీళ్లు సరిపడినా ఎండాకాలం ప్రారంభమయ్యే సరికి కాలనీలో నీటి సమస్య ప్రారంభమవుతున్నదన్నారు. కాలనీలోని ఇండ్లకు బోరు నీళ్లు సరిపడా రావడం లేదని, మిషన్ భగీరథ నీళ్లు సన్నగా, కొద్దిసేపు మాత్రమే వస్తున్నాయన్నారు. దీంతో ప్రతి రోజూ నీటి ఎద్దడి ఏర్పడుతున్నదన్నారు. ఎండలు ప్రారంభమైననాటి నుంచి వాటర్‌బబుల్స్ కొనుగోలు చేసుకుంటున్నామన్నారు. దిగువ తరగతి ప్రజలు నివసించే కాలనీలో నీళ్లు సరిపడక, వాటర్‌బబుల్స్ కొనుగోలు చేయడం ఆర్థిక భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేండ్లుగా బీడీ కాలనీలో ప్రతి ఏడాది తాగునీటి సమస్య నెలకొంటున్నదని, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు తమ కాలనీలో మరొక్క బోరు వేయించి తాగునీటి సమస్య తీర్చాలని స్థానికులు కోరారు.

చెక్కుల పంపిణీ

పోచారంలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

నాగిరెడ్డిపేట, మార్చి 9: మండలంలోని పోచారం గ్రామంలో కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. గ్రామానికి చెందిన నిరూడి దేవయ్య కూతురు సంకీర్తనకు కల్యాణలక్ష్మి చెక్కు, కలాలి రామమ్మకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ నర్సాగౌడ్, దేవయ్య, రమేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

శెట్పల్లి సంగారెడ్డిలో..

శెట్పల్లి సంగారెడ్డిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న నాయకులు

లింగంపేట్, మార్చి 9: మండలంలోని శెట్పల్లి సంగారెడ్డిలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మండల నాయకులు అందజేశారు. గ్రామానికి చెందిన నీల అలేఖ్యకు రూ. 60 వేలు, సాయిబాబాకు రూ.16 వేలు, వడ్ల బహుగుణాచారికి రూ.18 వేల విలువైన చెక్కులను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహిన్, శ్రీనివాస్‌రెడ్డి, కోరబోయిన పాపయ్య, సుభాష్, దుర్గయ్య, ప్రశాంత్, పెద్దబాబు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పోల్కంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

లింగంపేట్, మార్చి 9: మండలంలోని పోల్కంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో చదువుకున్న 2008-2009 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు తమకు చదువునేర్పిన ఉపాధ్యాయులు, సహవిద్యార్థులతో కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళం నిర్వహించారు. 16 ఏండ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకున్నారు. తాము చదివిన బడిని, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దకొడప్‌గల్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పెద్ద కొడప్‌గల్, మార్చి 9 : ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రజలకు సైబర్ నేరాలపై ఆదివారం ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే మెస్సేజ్‌లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఉచితాలకు ఆశపడి మోసపోవొద్దన్నారు. బ్యాంక్‌ల రివార్డు లింక్‌లను ఓపెన్ చేయవద్దని వివరించారు. ఫోన్‌కు వచ్చిన ఓటీపీలు చెప్పవద్దని, సైబర్ నేరానికి గురైతే వెంటనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సాయిశివ, అంజి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట, మార్చి 9: పోలీస్‌స్టేషన్‌లో స్థానిక ప్రజలకు సైబర్ నేరాలపై హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ ఆదివారం అవగాహన కల్పించారు. రైతులు, చదువు రాని వాళ్లు అత్యధికంగా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుంటున్నారన్నారు. బ్యాంకు అకౌంట్లో ఎక్కువ నగదు ఉన్నప్పుడు గుర్తించిన నేరగాళ్లు..తాము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఫోన్ చేసి ఓటీపీ నంబర్ చెప్పాలని నమ్మిస్తారన్నారు. అలాంటి వాటికి స్పందించ వద్దని, నేరుగా వచ్చి బ్యాంకు సిబ్బందిని కలిసి వివరాలు అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఎస్సై మల్లారెడ్డి ఆదేశాల మేరకు అవగాహన సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

కామారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సభ్యులు

లింగంపేట్, మార్చి 9: జిల్లా కేంద్రంలో కామారెడ్డి అవార్డీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని అయిలాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం దామోదార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా 2024 విద్యా సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా 24 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి ఆంజనేయశర్మ, ఏటీఏ సభ్యులు, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న చిన్ననాటి స్నేహితులు

రామారెడ్డి, మార్చి 9: మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో సిద్ధం భైరయ్య అనే యువకుడు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. 1998-1999 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన చిన్ననాటి స్నేహితులు ఆదివారం ఆయన కుటుంబానికి 10 వేల రూపాయల నగదు, 50 కిలోల బియ్యం అందజేశారు. ఆయన పిల్లలకు చదువు విషయంపై భరోసా కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దోమల శ్రీధర్, మహేందర్, రవి, గుర్జకుంట స్వామి, కృష్ణ, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.